సాక్షి వికారాబాద్

ఆదివారం । 15 । జనవరి । 2023



యాంత్రీకరణ వట్టిదేనా?

వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచిన యంత్ర లక్ష్మి పథకం అటకెక్కింది. సబ్సిడీ పరికరాలు, అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో ▸



బస్టాండున్నా..

పెద్దేముల్ మండల కేంద్రంలోని బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్సులు ఇందులోకి రావడం లేదు. 9లో ▸

సంక్రాంతి సందడి

అందమైన రంగవల్లులు.. గొబ్బెమ్మలు కొలువుదీరిన వాకిళ్లు.. రంగురంగుల గాలిపటాలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. హరిదాసుల చిడుతల చప్పుళ్లు.. పిండి వంటల తయారీ. ఏ ఇంటిని చూసినా సంక్రాంతి సందడే సందడి. పండుగను పురస్కరించుకుని పట్నం నుంచి పల్లెకు చేరిన వలస అతిథులతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయి.

న్యూస్‌రీల్

పట్టాలు తప్పిన గూడ్స్

- వలు రైళ్ల దారి మళ్లింపు
- ఇబ్బంది పడిన ప్రయాణికులు



అనంతగిరి: కర్నాటక రాష్ట్రంలోని చిత్తాపూర్ సమీపంలోని సుల్‌హాలీ రైల్వే స్టేషన్ వద్ద శనివారం మధ్యాహ్నం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో ఆ రూట్‌లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అప్రమత్తమైన రైల్వేశాఖ హుటాహుటిన పునరుద్ధరణ పనులు చేపడుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లను దారి మళ్లించగా.. తాండూరు, సేడం, మళ్లేడ్, చిత్తాపూర్ వరకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నాందేడ్‌-బెంగళూర్ రైలు, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వికారాబాద్ నుంచి సికింద్రాబాద్, రాయచూర్ మీదుగా దారి మళ్లించారు. ముంబై రూట్‌లో ప్రయాణించే కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ(ముంబై), శతాబ్ది, రాజ్‌కోట్, హుస్సేన్‌సాగర్(ముంబై), హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వికారాబాద్ నుంచి జహీరాబాద్, బీదర్, ఖానాపూర్ జంక్షన్ మీదుగా కల్బుర్గికి దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఆర్టీసీ అధికారులు వికారాబాద్ నుంచి తాండూరు వరకు ప్రత్యేకంగా 30 బస్సు సర్వీసులు ఏర్పాటు చేసి ప్రయాణికులను తరలించారు. కాగా పండగకు ఊరెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు వికారాబాద్ స్టేషన్‌లో ఉండిపోయారు.



అనంతగిరి: వికారాబాద్‌లోని వాసవీ కాలనీలో భోగి మంటలు వేస్తున్న మహిళలు, యువతులు



కొడంగల్: సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు



అనంతగిరి: గంగిరెద్దుకు అరటిపండు తినిపిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

తీరని శోకం..

- బకెట్లో పడి ఏడాది చిన్నారి దుర్మరణం
- వికారాబాద్‌లో పండుగ పూట విషాదం

అనంతగిరి: వికారాబాద్‌లో పండుగ పూట విషాదం నెలకొంది. అంబాడుతూ వెళ్లిన ఏడాది బాలుడు బకెట్లో పడి మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నా యి.. పట్టణంలోని పాత శిశు మందిరం సమీపంలో నివాసముండే దశరథ్, భాగ్యలక్ష్మికి ఇద్దరు సంతానం. వీరిలో చిన్నవాడు విఖ్యాత్ (1). పండుగ సందర్భంగా శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఎవరి పనుల్లో వారుండగా.. ఆడుకుంటూ వెళ్లిన చిన్నారి బాత్‌రూంలోని బకెట్‌లో ఇరుక్కున్నాడు. తలకిందులుగా పడటంతో బకెట్‌లోనే ప్రాణాలు వదిలాడు. అరగంట తర్వాత బాబు కోసం చూడగా ఉలుకుపలుకు లేకుండా బకెట్లో పడి కనిపించాడు. దీంతో తల్లి, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తండ్రి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లోని ఓ షోరూంలో సెల్ ఫోన్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే డ్యూటీకి వెళ్తూ వికారాబాద్ స్టేషన్‌లో రైలు ఎక్కాడు. ఇంటి నుంచి ఫోన్ రావడంతో తిరిగివచ్చి కన్నీటి పర్యంతమయ్యాడు. ఇదిలా ఉండగా గత నెల 24న విఖ్యాత్ తొలి పుట్టిన రోజు ఘనంగా వేడుకలు జరుపుకొన్నారు. ఆ తీపి జ్ఞాపకాలు మరువకముందే చిన్నారి మృతి చెందడం కుటుంబ సభ్యులను శోక సంద్రంలో ముంచింది.



విఖ్యాత్ (ఫైల్)

పకడ్బందీగా 'కంటి వెలుగు'

డీపీఓ తరుణ్‌కుమార్

దౌల్తాబాద్: జిల్లాలో ఈ నెల 18న ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీపీఓ తరుణ్‌కుమార్ అన్నారు. దౌల్తాబాద్, చల్లాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న సెంటర్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కంటివెలుగు నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. నేత్ర పరీక్షలు చేయించుకునేవారు ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో టాంటాం వేయించాలని, రోజువారీ టార్గెట్‌ను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌యాదవ్, ఎంపీఓ రవీందర్, వైద్యాధికారి రతన్‌లాల్, సర్పంచ్ శిరీషరమేశ్, పంచాయతీ కార్యదర్శి ఆనందం ఉన్నారు.

పద్మనాభుడి సేవలో..



బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం శనివారం కుటుంబ సభ్యులతో కలిసి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ తదితరులు ఉన్నారు.

– అనంతగిరి

GIRIDHARI® NIRVANA

happy New Year & Pongal 2023



INTRODUCING **LUXURY VILLAS**

G + 1 (2200 sft.)
Starts at 180 Sq. Yds.

YENNEPALLY, VIKARABAD
OPP. NEW COLLECTORATE OFFICE & NEAR MAHAVEER HOSPITAL

Own Your Villa & Experience Nirvana

PRICES RISING UP FROM 1st FEBRUARY '23. HURRY UP !!

www.giridhariconstructions.com
FOLLOW US ON

VILLAS | APARTMENTS | VILLA PLOTS | FARMLANDS

HEAD OFFICE: Journalist's Colony 'A', 121-A/1, Beside 121-A, Jubilee Hills, Road No. 70, Hyderabad - 500033.

FOR BOOKINGS, CALL
8000 666 668
Marketing Office Open on Sundays Also

*T&C Apply
₹ 5000*/SFT
*Corpus, Maintenance, GST & Other Charges by the Govt. as Applicable
Offer Valid till 31st January, 2023 Only.

GIRIDHARI® CONSTRUCTIONS PVT. LTD.
Experience Excellence
Villas | Apartments | Villa Plots | Farmlands

క్లుప్తంగా

వైభవంగా ఊరడమ్మ బోనాలు



నారెగూడలో బోనాల ఊరేగింపు

నవాబుపేట: మండల పరిధిలోని నారెగూడ భక్తజన సంద్రమైంది. గ్రామంలో శనివారం ఊరడమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి అభిషేకం, అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా బోనాలతో ఊరేగింపు తీశారు. ర్యాలీగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల ఆటాపాట అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్మయ్య, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ రమేశ్‌రెడ్డి, గ్రామస్తులు మహిపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, రఘునందన్‌రెడ్డి, చంద్రారెడ్డి, శివరాజ్, శేకర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం అందించండి

షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్: అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని భగత్‌సింగ్, టీచర్స్ కాలనీల్లో శనివారం పట్టణ సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో కలిసి పర్యటించారు. సంక్రాంతి సందర్భంగా తాళం వేసి వెళ్లిన ఇళ్లను పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ.. పండుగ సందర్భంగా చాలా మంది ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు వెళ్తుంటారని, ఇదే అదనుగా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారని అన్నారు. వెళ్లేటప్పుడు మెయిన్ డోర్‌కు సెంటర్ లాకింగ్ వేయాలని, విధిగా డోర్‌లకు కర్టెన్లు ఏర్పాటు చేయాలని, విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులు, నగదును ఇళ్లలో ఉంచుకోవద్దని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊళ్లకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు, ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే 100కు డయల్ చేయాలని, లేదంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో కాలనీవాసులు విప్పరి నరేష్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివార్ల పల్లకీసేవలో భక్తులు

కమనీయం.. గోదాదేవి కల్యాణం

- శ్రీవారి ఆలయంలో కల్యాణ వేడుకలు
- భక్తితో పులకించిన భక్తజనం

కొడంగల్: శ్రీహరి నామస్మరణతో కొడంగల్ ఆలయం మారుమోగింది. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని భక్తుల సమక్షంలో వైభవంగా జరిపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారి, అమ్మవార్ల మూల మూర్తులను అందంగా అలంకరించారు. గర్భగుడి నుంచి ఉత్సవ మూర్తులను తెచ్చి పెళ్లి మండపంలో ప్రతిష్ఠించారు. అర్చకులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి వివాహ వేడుకను కనువిందుగా జరిపించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కదంబం అనే ప్రత్యేకమైన ప్రసాదాన్ని తయారు చేయించి భక్తులకు పంపిణీ చేశారు. నెల రోజుల పాటు తిరుప్పావై పారాయణం నిర్వహించిన అనంతరం గోదాదేవి అమ్మవారు శ్రీరంగ నాథస్వామి వారిని వివాహం చేసుకున్న శుభ ఘడియల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

బీజేపీ, బీఆర్‌ఎస్‌ను జనం నమ్మడంలేదు

- పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్

తాండూరు: బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ దొందుదొందేనని, ఈ పార్టీలను ప్రజలు నమ్మడంలేదని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రమేశ్ మహరాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చందుమహరాజ్ చౌక్ కూడలి వద్ద పార్టీ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. వందలాది మంది కార్యకర్తల సమక్షంలో ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్ ఆధ్వర్యంలో రమేశ్ మహరాజ్‌ను గజమాలతో సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో రమేశ్‌మహరాజ్ మాట్లాడుతూ.. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి రాజకీయాలు తెలుగు సినిమాలను తలపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేకు ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే బెదిరింపులు పాల్పడటం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేయిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేయడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం భారత్ జోడో యాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీని అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కందనెల్లి శోభారాణి, కౌన్సిలర్లు మమత, మధుబాల, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎంఏ అలీం, యూత్ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్, నాయకులు తదితరులున్నారు.



రమేశ్ మహరాజ్‌ను గజమాలతో సన్మానం చేస్తున్న నాయకులు

పర్యాటక క్షేత్రంగా జేపీదర్గా



బాబాకు చాదర్ సమర్పించడానికి వెళ్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్, ఎమ్మెల్యే అంజయ్య

- వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్ హామీ

కొత్తూరు: రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి శనివారం ఆయన బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు దర్గా అభివృద్ధికి సంబంధించి మాస్టర్‌ప్లాన్ రూపకల్పన తుదిదశలో ఉందన్నారు. ప్లాన్ సిద్ధం అయిన వెంటనే ముఖ్యమంత్రి ఆమోదంతో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాస్టర్‌ప్లాన్ మేరకు అభిదృద్ధి పనులు చేపడితే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అజయ్ నాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, విశ్వం, గోపాల్‌నాయక్, తస్లీం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ వట్టిదేనా?

- 'యంత్రలక్ష్మి'పై నీలినీడలు
- పథకం కొనసాగింపుపై స్పష్టత కరువు
- నాలుగేళ్లుగా నిలిచిపోయిన సబ్సిడీ పరికరాల పంపిణీ



పొలంలో ట్రాక్టర్ ద్వారా విత్తనాలను విత్తుతున్న రైతు

తాండూరు: వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన యంత్ర లక్ష్మి పథకం అటకెక్కింది. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు సబ్సిడీ ద్వారా పరికరాలను పంపిణీ చేయాల్సి ఉంది. పథకంపై సంబంధిత శాఖ అధికారుల నుంచి స్పష్టత కరువైంది. గతంలో సబ్సిడీ యంత్రాల కోసం రైతులు దరఖాస్తు చేసుకొన్నారు. సబ్సిడీపై యంత్రాలు అందుతాయని ఎంతో ఆశతో ఉన్న రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించడం లేదు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులకు కూలీల కొరత వేధిస్తోంది. దీంతో రైతులు సమయానికి సస్యరక్షణ చర్యలు, కోతలు, దుక్కి దున్నడం లాంటి వాటికోసం ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు రైతుబంధు పథకం అమలు తర్వాత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందించే సబ్సిడీలను కొన్నాళ్లుగా అందించక పోవడం గమనార్హం.

2.60లక్షల మంది రైతులు..

జిల్లాలో 6 లక్షల ఎకరాల భూమిలో 2.60 లక్షల మంది వ్యవసాయం చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతుల ద్వారా సాగు విధానం మార్చుకోవాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అందుకోసం వ్యవసాయాన్ని సాంకేతిక పద్ధతులలో నిర్వహించి దిగుబడులు పెంచేలా ప్రణాళిక చేశారు. అందులో భాగంగా రైతులకు సబ్సిడీపై యంత్రాలను పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టారు. అయితే మధ్యలోనే పథకం నిలిచి పోయింది. దీంతో రైతులు ట్రాక్టర్లు, పనిముట్లపై ఎంతో ఆశలు పెట్టుకున్నారు. గతంలో పంపిణీ చేసిన వాహనాలు, యంత్రాలు చాలా వరకు అధికార పార్టీ నాయకులు, సంపన్నులే సబ్సిడీ ద్వారా లబ్ధిపొందారు. తర్వాత రోజుల్లో తమకు అందుతాయని రైతులు ఆశగా ఎదురు చూశారు. నాలుగేళ్లుగా సబ్సిడీ పనిముట్ల పంపిణీ నిలిచి పోయింది. కనీసం ఈ సీజన్‌లో తమకు అవకాశం కల్పించాలని రైతులు ఎదురు చూస్తున్నారు. అసలు యంత్రలక్ష్మి పథకం ఉన్నట్టా.. లేనట్టా అనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

గతంలో 270 మందికి..

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు యంత్రలక్ష్మి ద్వారా 95 శాతం సబ్సిడీ ట్రాక్టర్లు పంపిణీ చేశారు. బీసీ, జనరల్ సామాజిక వర్గాలకు 50 శాతం సబ్సిడీ అందించింది. దీంతో 2017-18 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 270 మంది రైతులకు సబ్సిడీపై వాహనాలను పంపిణీ చేశారు. ఆ తర్వాత పథకం నిలిచి పోయింది. నాలుగేళ్లుగా సబ్సిడీ ద్వారా యంత్రాలను తీసుకొనేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

ఆధునీకం ఉత్తిదేనా?

వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తామని ప్రభుత్వ పలు సందర్భాలలో ప్రకటిస్తూ వస్తోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత రెండు సార్లు యంత్ర లక్ష్మి పథకాన్ని కొనసాగించారు. తర్వాత పథకం అమలును అటకెక్కించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆధునిక పనిముట్లు అయిన ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్‌లు, రోటొవేటర్లు, హార్వేస్టర్లు, కల్టీవేటర్లు, నాగళ్లు, దమ్ము చక్రాలతో పాటు, పురుగు మందు పిచికారి చేసి తైవన్ స్ప్రేయర్‌లు, డ్రోన్ స్ప్రేయర్‌లు సబ్సిడీ ద్వారా అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే ఈ సీజన్‌లో మాత్రం పథకం అమలు అవుతోందా లేదా అనేది అంతుపట్టడం లేదు.

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గతంలో యంత్రలక్ష్మి పథకం కింద రైతులకు సబ్సిడీపై యంత్రాలను పంపిణీ చేశాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అర్హులైన రైతులను గుర్తిస్తాం. సబ్సిడీ యంత్రాల కోసం రైతులు వినతులు అందిస్తున్నారు.

– గోపాల్, వ్యవసాయాధికారి



లారీ, ఆటో ఢీ

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు



తీవ్ర గాయాలతో పడిపోయిన ఆటో డ్రైవర్

ధారూరు: లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంటి మామిడి రోడ్డు మలుపులో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు నుంచి హైదరాబాద్‌కు ఆటో వెళ్తుండగా, తాండూరుకు వెళుతున్న లారీ రోడ్డు మలుపులోకి రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో తాండూరుకు చెందిన ఆటో డ్రైవర్ దేశ్‌ముఖ్ బస్వరాజ్(35) తీవ్రగాయాలతో రోడ్డుపై పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా మారడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఎస్‌కే రావల్‌ను అదుపులోకి తీసుకుని లారీని పీఎస్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

తుర్కయంజాల్: పాఠశాల విద్యలో సమస్యలను అధ్యయనం చేసేందుకు వెంటనే విద్యా కమిషన్‌ను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరింది. సంఘం 5వ రాష్ట్ర మహాసభలు శనివారం రెండోరోజు తుర్కయంజాల్‌లోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు పలు సమస్యలపై 23 తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, రవి మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం -2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు -మనబడి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించినా ఇప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. వెంటనే స్వీపర్, అటెండర్, వాచ్‌మన్, క్లర్క్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ప్రభుత్వం అదనంగా ఉపాధ్యాయులను నియమించడం మరిచిందని అన్నారు.

మెడికల్ కళాశాల పనులు వేగిరం



కొనసాగుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు

- త్వరలో ప్రత్యేక బృందం పరిశీలన
- తరగతులు అనంతగిరిలో, ఆస్పత్రి రాజీవ్‌నగర్‌లో ఏర్పాటుకు చర్యలు

వికారాబాద్ అర్బన్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జిల్లా ప్రజల కల త్వరలో నెరవేరనుంది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ సమీపంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత ఏడాది వికారాబాద్‌కు మెడికల్ కళాశాలను మంజూరు అయిన విషయం విదితమే. అనంతగిరి టీబీ శానిటోరియంలో కళాశాలను ఏర్పాటు చేయాలనుకున్నారు. ఆ తరువాత మున్సిపల్ పరిధిలోని మేకల గండిలో కొత్త భవనం నిర్మించేందుకు 30 ఎకరాల స్థలం కూడా పరిశీలించారు. కొత్త భవనం నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందనే ఉద్దేశంతో తాత్కాలికంగా ఆ నిర్ణయాన్ని అలా ఉంచారు. ప్రస్తుతం ఒక అంతస్తుతోనే ఉన్న (రాజీవ్ నగర్) వికారాబాద్ ఏరియా ఆస్పత్రిని నాలుగు అంతస్తులుగా నిర్మించి అందులోనే మెడికల్ కళాశాలకు సంబంధించిన ఆస్పత్రిని కొసాగించాలని అధికారులు నిర్ణయించారు. మెడికల్ కళాశాల తరగతులు మాత్రం అనంతగిరిలోని టీబీ శానిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఏరియా ఆస్పత్రిని డిస్ట్రిక్ట్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కు అప్పగించారు. త్వరలో ఏరియా ఆస్పత్రి బోర్డు స్థానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిగా బోర్డు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు రావడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. మెడికల్ కళాశాల బోర్డు కూడా ఏర్పాటు చేయనున్నారు.

త్వరలో ప్రిన్సిపాల్ నియామకం

ఇరవై మంది వైద్యులను మెడికల్ కళాశాలకు కేటాయించిన ప్రభుత్వం వారం రోజుల్లో కళాశాల ప్రిన్సిపాల్‌ను కూడా నియమించబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించిన భవనాన్నే ప్రస్తుతానికి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు కేటాయించాలని నిర్ణయించారు. కళాశాలకు, ఆస్పత్రికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అన్నీ వసతులు సమకూరితే మరో మూడు నాలుగు నెలల్లో మెడికల్ కళాశాల సేవలు అందుబాటులోకి రానున్నాయి.

వారం రోజుల్లో ప్రత్యేక బృందం..

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సదుపాయాలు ఉన్నాయా? లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు వారం రోజుల్లో అధికారుల బృందం రానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మెడికల్ కళాశాలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు, నిబంధనల ప్రకారం పడకల సామర్థ్యం, ప్రసూతి, ఆపరేషన్ థియేటర్, చిన్ని పిల్లల వార్డులు, వైద్య సిబ్బంది, వైద్యులు, టీచింగ్, ఓపీ సంఖ్య వంటి వివరాలను పరిశీలించనున్నారు.

దొంగల అరెస్ట్, రిమాండ్

చేవెళ్ల: స్థానిక మీసేవా కేంద్రంలో చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న మీసేవా కేంద్రంలో ఈనెల 12న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదును అపహరించారు. మీసేవా కేంద్రం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సీసీ పుటేజీల ద్వారా దొంగలను పట్టుకున్నారు. గతంలో మీసేవలో పనిచేసిన జోగు శ్రీకాంత్, అతని స్నేహితుడు శివరాంబాబు కలిసి ఈ చోరీకి పాల్పడ్డారు.

చైనా మాంజా విక్రేతలపై కేసులు

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజా విక్రయిస్తున్న వ్యాపారులపై ఆదిబట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి నుంచి చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుర్కయంజాల్‌లో చంద్రశేఖర్, కమ్మగూడ కాలనీలో గౌని రాము, రాగన్నగూడలో గంజి వెంకట మల్లికార్జున్ అనే ముగ్గురు వ్యక్తులు నిషేధించిన మాంజాను విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద మొత్తం 1300 మీటర్ల మాంజా దారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నేడు క్రీడా సమ్మేళనం

తుక్కుగూడ: రావిర్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 1983 నుంచి 2022 వరకు పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులకు ఆదివారం కబడ్డీ పోటీలు (క్రీడా సమ్మేళనం) నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న పదోతరగతి బ్యాచ్ ఆధ్వర్యంలో ఈ క్రీడా సమ్మేళనం నిర్వహిస్తున్నారు.

బీఆర్‌ఎస్ బలం చాటుదాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

- ఇంటింటికీ కేసీఆర్ పథకాలు అందుతున్నాయి
- మరోసారి ఆయనను సీఎం చేయాల్సిన బాధ్యత అందరిది
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- కొడంగల్ ప్రజలందరికీ కుటుంబ సభ్యుడిలా ఉంటానని వెల్లడి

కొడంగల్: నియోజకవర్గ ప్రజలందరితో సొంత కుటుంబ సభ్యుడిలా ఉంటానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కొడంగల్ ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికి లబ్ధి జరుగుతోందన్నారు. ఆయన సారథ్యంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే మీటింగ్‌కు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. ఐదు లక్షల మందితో జరిగే సభతో బీఆర్‌ఎస్ బలాన్ని దేశానికి చూపాలన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రులు సభకు వస్తారని, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో తమ పార్టీకి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ఆయా రాష్ట్రాలకు చెందిన నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతారన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆకర్షితులవుతున్న ఎంతో మంది కేసీఆర్ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం సీఎం ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, ఉచిత విద్యుత్, ఒంటరి మహిళలకు పెన్షన్లు తదితర పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టంచేశారు. కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేయాల్సిన బాధ్యత లబ్ధిదారులు, ప్రజలందరిపైనా ఉందన్నారు. దళితులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో దళితబంధు పథకం ప్రవేశపెట్టి రూ.10 లక్షలతో ఉపాధి కల్పించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం రూ.22 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేసిందన్నారు. సంక్రాంతి తర్వాత కొడంగల్‌లో స్టేడియం నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. దౌల్తాబాద్ మండలం చంద్రకల్ సమీపంలో పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి కేటీఆర్‌ను కలిసి పర్మిషన్ తీసుకుంటామన్నారు. ఈనెల 18న ప్రారంభమయ్యే కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, సర్పంచులు అంజద్, చాంద్‌పాషా, టీఆర్‌ఎస్ నాయకులు దేశ్యానాయక్, టీటీ రామూనాయక్, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

WANTED

■ మా ఒక్క రూ. వడ్డీ అప్పు పథకములు అమలు పరచి జీతం లేదా కమీషన్ పొందు స్త్రీ, పురుషులు వివరాలకు సంప్ర. సురభి నిలయం షాద్ నగర్. ఫోన్ : 9502907465. [H-792574]

■ Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd, మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.